ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





అభివృద్ధి పనులు మందగమనం

నిధులు ఉన్నా ముందుకు సాగని వైనం - ప్రత్తిపాడు, మంగళగిరి వెనుకంజ



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనుల్లో ఆశించినంత పురోగతి లేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పర్యటిస్తున్న సందర్భంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారం కోసం ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేసింది. సిసిరోడ్లు, గ్రావెల్ రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు, వీధి లైట్లు, కమ్యూనిటీ హాల్సు తదితర పనులకు ఎక్కువగా ప్రతిపాదనలు అందాయి.

గుంటూరు జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు 568 ఉండగా రూ.113.60 కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు 568 సచివాలయాల్లో 823 పనులకు జిల్లా కలెక్టరుకు ప్రతిపాదనలు ఇచ్చారు. పనులకు ప్రతిపాదనలు అందచేయడం, చేపట్టిన పనులు పూర్తిచేయడంలో ప్రత్తిపాడు, మంగళగిరి నియోజకవర్గాలు బాగా వెనుకబడి ఉన్నాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 62, పశ్చిమలో 53, మంగళగిరిలో 42, పొన్నూరు 117, ప్రత్తిపాడు 10, తాడికొండ 146, తెనాలి 125 పనులు పురోగతిలో ఉన్నాయి. గత ఆరు నెలల కాలంలో గుంటూరు తూర్పు 10, పశ్చిమ 32, పొన్నూరు 12, పత్తిపాడు 10, తాడికొండ 39, తెనాలి 37 పనులు పూర్తయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం 555 పనులు చేపడితే 151 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 12 పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తిరస్కరించారు.

జిల్లాలో చాలా వరకు నామినేషన్ పద్ధతిలో పనులు జరుగుతున్నాయి. గుంటూరులో మాత్రం నామినేషన్ పద్ధతికి కమిషనర్ అంగీకరించలేదు. ప్రజా ప్రతినిధుల వత్తిడి మేరకు రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిపై పనులు చేపట్టేందుకు అనుమతిచ్చారు. దీంతో వైసిపిలోని ద్వితీయశ్రేణి నాయకులు రూ.5 లక్షల లోపు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. అయితే టెండరు పద్ధతిలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు రావడం ముందుకు రావడం లేదు. 2018లో టిడిపి ప్రభుత్వం హయాంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, ముఖ్యమంత్రి సహాయనిధి పనులకు డబ్బులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడ్డారు. చాలా మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో నామినేషన్ పద్ధతిపై పనులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

ఎమ్మెల్యేలు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని ఇంకా కొంత మంది ఎమ్మెల్యేలు గడపగడపకు కార్యక్రమంలో ఆసక్తి చూపకపోవడం వల్ల ప్రతిపాదనలు రావడంలేదని తెలిసింది. జిల్లాలో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కొన్నినెలలుగా నియోజకవర్గానికి అందుబాటులో లేరు. ఆమె స్థానంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి కత్తెర సురేష్‌కుమార్ ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రత్తిపాడు, మంగళగిరి నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో గడపగడప జరగకపోవడంవల్ల పనులకు ప్రతిపాదనలు అనుమతించ లేదని తెలిసింది. మొత్తంగా రూ.113.60 కోట్లకు గాను జిల్లాలో ఇప్పటి వరకు కేవలం రూ.60 కోట్లకే ప్రతిపాదనలు అందాయని తెలిసింది.



వార్త మెయిన్‌లో

ఎన్‌ఎఫ్‌పిఇ గుర్తింపు రద్దు అప్రజాస్వామికం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన



గుంటూరు జిల్లా డిఇఒ శైలజకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

వేసవి సెలవులు హరించే చర్యలొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల వేసవి సెలువుల్ని హరించే చర్యలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ ఎం.కళాధర్ అన్నారు. వేసవి సెలువుల్లో వివిధ రకాల విధుల పేరుతో ఉపాధ్యాయుల్ని పాఠశాలలకు వెళ్లాలని ఒత్తిడి చేయటం మానుకోవాలని కోరుతూ గుంటూరు డిఇఒకు ఫ్యాప్టో నాయకులు గురువారం వినతిపత్రం అందచేశారు. వేసవి సెలవుల్లో నాడు-నేడు, ఆన్‌లైన్ ట్రైనింగ్, ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు, తదితర పనులను రాతపూర్వక ఆదేశాలు లేకుండా మౌఖిక ఆదేశాలు ద్వారా ఒత్తిడి చేయటం సరికాదని అన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు ఏదైనా బాధ్యతలు అప్పగించాల్సి వస్తే, రాతపూర్వక ఆదేశాలిచ్చి, సెలవుల్లో పని చేసినందుకుగాను వారికి రావాల్సిన సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రెటరీలు జి.మోహన్‌రావు, ఎమ్‌డి ఖాలీద్, జి.వేళాంగిణిరాజు, కార్యవర్గ సభ్యులు సిహెచ్.నరసింహారావు, కె.బసవలింగారావు, ఎం.సుబ్బారావు, ఫ్యాప్టో సభ్యులు జి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర జాతా

- ఈనెల 31 నుండి జూన్ 9వ తేదీ వరకూ నిర్వహణ
- జయప్రదానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు

8లో

పంటనష్టం 33 శాతం దాటితే నమోదు చేయండి

- పంట నష్టం వివరాల సేకరణపై కలెక్టర్ ఆదేశం
- పల్నాడు జిల్లాలో 55 వేల సిసిఆర్‌సిల జారీ లక్ష్యం



సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఇటీవల అకాల వర్షాలకు 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం వాటిల్లిన పొలాలు, రైతుల వివరాలను సేకరించాలని, దీంతోపాటు రానున్న ఖరీఫ్ సాగుకు రైతులను సన్నద్ధం చేయాలని వ్యవసాయాధికారులు, సిబ్బందికి పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొలాల నుండి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష ఫలితాలను ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు అందించాలన్నారు. పచ్చిరొట్ట పంటల సాగుపై అవగాహన కల్పించాలని, అవసరం మేరకు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. యంత్ర సేవా పథకం కింద రెండవ విడత మిగిలిన 147 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు యంత్ర పరికరాలు సరఫరా

2లో



ఇసుక క్వారీలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇసుకను తరలించే లారీకి క్లీనర్‌గా వచ్చిన యువకుడు ఇసుకలో కూరుకుపోయి మృత్యువాత పడ్డాడు. ఇప్పటికే తండ్రిని కోల్పోయిన ఆ కుటుంబానికి ఆదరువుగా నిలుస్తున్న కుమారుడూ చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. వివరాల ప్రకారం.. పార్వతీపురానికి చెందిన బండారు వర్మ తండ్రి గతంలోనే మృతి చెందాడు. ఈ నేపథ్యంలో తల్లి, చెల్లి పోషణ బాధ్యతను వర్మ తీసుకున్నాడు. ఇందులో భాగంగా లారీ క్లీనర్‌గా వెళు_న్నారు. ఈ క్రమంలో ఎంటిఎం పరిధిలోని గుండిమెడ నుండి ఇసుకను తరలించే వాహనంపై పనికి వెళ్లాడు. బుధవారం రాత్రి లారీ ఇసుక పాయింట్‌లో ఉండగా దానికి పొక్లెయినర్ ఇసుక నింపుతోంది. అయితే లారీ బాడీలో ఉన్న వర్మపై ఇసుక పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది తెలిసిన

2లో

ఇసుక క్వారీలో యువకుడు దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గురువారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా యువకుని మృతి విషయం తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, నాయకులు కె.సుందరయ్య, పి.వేణు పరిశీలించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువకుడు మృతి పట్ల పలు అనుమానాలున్నాయని అన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు వ్యతిరేకంగా తవ్వకాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఇసుక సరఫరా చేసే జేపీ కంపెనీ బినామీ అని ఆరోపించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఇసుక మాఫియాను నడిపిస్తున్నారని, 15 హెక్టార్లలో అనుమతులుంటే వందలాది హెక్టార్లలో ఇసుక దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఇసుకపై అక్రమాలు జరుగుతుంటే మంగళగిరి ఎమ్మెల్యే ఎక్కడున్నారని ప్రశ్నించారు. గుండిమెడ ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపేయాలన్నారు.

పంటనష్టం 33 శాతం దాటితే నమోదు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, మొదట విడతలో ఎంపిక చేసిన 20 మంది డ్రోన్ పైలెట్లకు శిక్షణ పూర్తి చేసి వీరి ద్వారా జిల్లాలోని ఇతర రైతులకు సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కౌలురైతులకు లక్ష్యానికి అనుగుణంగా 55 వేల పంట సాగుదారు పత్రాలను (సిసిఆర్‌సి) జారీ చేయాలని, రైతులకు పంట రుణాలపై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ రవికుమార్, ఏవోలు పాల్గొన్నారు.

నగదు చోరీ

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

క్రాప్ లోన్ తీసుకొని కొబ్బరి బొండం నీళ్ల తాగేందుకు ఆగి బైక్‌పై ఉంచిన బ్యాగ్‌ను చోరీ చేసిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. బాధితుడు నిమ్మల నరసింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తాను ఓ బ్యాంక్‌లో క్రాప్ లోన్ ద్వారా రూ. 1.60 లక్షల నగదును తీసుకొని తిరిగి తన సొంత గ్రామమైన న్యూ వెల్లంపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో కొబ్బరి బొండం నీళ్ల తాగేందుకు రైల్వే స్టేసన్ మూల వద్ద ఆగారు. కొబ్బరి నీళ్ల తాగుతుండగా నలుగురు వ్యక్తులు వచ్చి బైకుకు తగిలించిన బ్యాగ్‌ను తీసుకెళ్లారని బాధితుడు నరసింహారెడ్డి తెలిపారు.

వివాహిత అదశ్యంపై కేసు

ప్రజాశక్తి -తెనాలి

వివాహిత అదృశ్యమైన సంఘటనపై పట్టణ 3 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మారిస్ పేటకు చెందిన మహిళ పాతార్లంక రమాదేవి ఈనెల 7న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వెంట వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె వసూలుపై వివాదం

ప్రజాశక్తి -తెనాలి

అద్దె వసూలు చేసే క్రమంలో కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ శివారు ప్రాంతమైన వైవిఆర్ కాలనీలో పిల్లి అబ్రహంకి ఓ ఇల్లు ఉంది. అది అద్దెకిచ్చిన నేపథ్యంలో అబ్రహం కుమారుడు సుధాకర్ అద్దె వసూలు చేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబం మధ్య నెలకొన్న స్వల్ప వివాదాల నేపథ్యంలో అబ్రహం, అతని కుమార్తె సుధారాణి గురువారం ఆ ఇంటికి తాళం వేశారు. దీనిపై ఆగ్రహించిన సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు

అర్జీల పరిష్కారం చేయండి

ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రజలు సమస్యలపై అందించిన అర్జీలను అధికారులు సక్రమంగా పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే.ఎస్.జవహర్ రెడ్డి సుస్థిర అభివద్ది లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, స్కూల్ ఎడ్యుకేషన్, గ్రామ, వార్డు సచివాలయాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, స్పందనలో ప్రజలు అందించిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి గుణాత్మకంగా నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా జిల్లా కలెక్టర్లు అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించాలన్నారు. మన బడి నాడు నేడు ద్వారా మంజూరు చేసిన పాఠశాలల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు పాఠశాలల పున:ప్రారంభం రోజునే పంపిణీ చేయడానికి వీలుగా జిల్లాకు వచ్చిన కిట్లను ఎప్పటికప్పుడు నాణ్యతను తనిఖీ చేసి మండల కేంద్రాలల్లో స్టోర్ రూములకు సక్రమంగా పంపిణీ అయ్యేలా విద్యా శాఖ అధికారులతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్డుల ఎన్రోల్మెంట్ పెంచడంతో పాటు, విద్యా సంవత్సరం పూర్తి చేసిన విద్యార్డులు డ్రాప్ ఔట్స్ లేకుండా గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, విద్యాశాఖాధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. సుస్థిర అభివద్ది లక్ష్యాలు, వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలలో అమలు జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించి సూచనలు అందించారు. జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, జెడ్పీ సిఈఓ మోహన్ రావు, డియం అండ్ హెచ్ ఓ డా . శ్రావణ్ బాబు, డిఈఓ శైలజ, సమగ్ర శిక్ష ఏ.పీ.సీ విజయలక్ష్మీ, జీయంసీ అదనపు కమిషనర్ పెద్ది రోజా, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ జయరామ కష్ణ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి



ఊటీ సమ్మర్ స్పెషల్ టూర్ ప్యాకేజీ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నుండి ఊటీ కి స్పెషల్ సమ్మర్ టూర్ ప్యాకేజీను సౌకర్యం కల్పిస్తున్న ఎపిఎస్‌ఆర్‌టిసి గుంటూరు-2 డిపో ఒక ప్రకటనలో పేర్కొంది. గుంటూరులో మే 20వ తేదీ సాయంత్రం 6:00 గంటలకు ఊటీ కి బస్సు బయలు దేరి, మే 21 ఉదయం 10:00 గంటలకు మైసూర్ చేరుతుందని, మైసూర్ లోని మైసూర్ పాలస్, బందావన్ గార్డెన్స్ చూసుకొని,16::00 గంటలకు మైసూర్ లో బయలు దేరి రాత్రి 19:00 గంటలకు ఊటీ చేరుతుందని తెలిపింది. అదే రోజు రాత్రి అక్కడ బస చేసి, ఊటీ లో వున్న రోజ్ గార్డెన్, టీ ఎస్టేట్, ఊటీ లేక్, బొటానికల్ గార్డెన్‌తో పాటు ఇతర ముఖ్య ప్రదేశాలను చూసుకొని మే 22 రాత్రి 19:30 గంటలకు తిరిగి ఊటీ లో బయలుదేరుతుందని పేర్కొంది. నాలుగవ రోజు అనగా మే 23 న ఉదయం 10:00 గంటలకు బస్సు గుంటూరు చేరుతుందనిని డిపో మేనేజర్ ఎస్‌కె అబ్దుల్ సలామ్ తెలిపారు. .ఈ సర్వీస్ కు ఆన్‌లైన్ ద్వారా టికెట్స్ బుక్ చేసుకొనే అవకాశం ఉందదని, 98725 సర్వీస్ నెంబర్ ద్వారా ఆన్‌లైన్ లో టికెట్స్ బుక్ చేసుకోవచ్చని వివరించారు.ఒక్కో టికెట్ ధర రూ.3,400/- అని, అదనపు సమాచారం కోసం 7382897459,7382896403, 9959225421 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవా లని కోరారు.



శుభాష్ మెగా ఎగ్జిబిషన్ ను ప్రారంభిస్తున్న నటి ప్రణీత

విరించి ఫ్యామిలీ షాపింగ్ మాల్‌లో నటి ప్రణీత

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మిపురం మెయిన్ రోడ్డు లోని బేకర్స్‌ఫన్ ఎదురుగా ఉన్న విరించి ఫ్యామిలీ షాపింగ్ మాల్‌లో ప్రముఖ నటి ప్రణీత శుభాష్ మెగా ఎగ్జిబిషన్ సేల్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం ప్రణీత మాట్లాడుతూ గుంటూరు నగరంలో వస్త్ర చరిత్రలోనే మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అబ్బురపరిచే డిజైన్లతో, వెరైటీలతో, సరికొత్త బ్రైడల్ కలెక్షన్స్‌తో అన్ని రకాల పట్టు వస్త్రాలతో డైరెక్ట్ వీవర్స్, తయారీదారుల అందించే ధరలకే లభించనున్నట్లు చెప్పారు. మదర్స్ డే సందర్భంగా ‘ మా మదర్‌కు శారీస్‌ను బహుమతిగా ఇచ్చేందుకు ఈ షోరూం నుండే కొనుగోలు చేశాను’ అని చెప్పారు. షోరూం అధినేత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ మెగా ఎగ్జిబిషన్ సేల్ ఈ నెల 31వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల వలయంలో తాళ్లపాలెం

- మురుగునీరు పారుదలకు చర్యలు శూన్యం
- ప్రమాధ భరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- అధికారులకు విన్నవించిన పట్టని వైనం



ప్రమాధభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

మండలంలోని తాళ్లపాలెం సమస్యల వలయంలో కుట్టుమిట్టాడుతుంది . గ్రామంలో మురుగునీరు పారుదల లేక ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లీ దోమలకు ఆవాసాలుగా మారింది. కొద్దిపాటి వర్షానికి మురుగు కాలవల్లో నీరు రోడ్లపైకి రావడంతో ప్రజలకు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామం ప్రధాన రహదారి తుంగభద్ర వంతెన పక్కన దశాబ్దాలుగా నిర్మించిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాద భరితంగా మారింది. చిన్నపాటి వర్షం గాలులకే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద పెద్ద మంటలు ఎగిసిపడటంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు ప్రక్కనే రెండు అడుగుల ఎత్తులో ఉండి విద్యుత్ తీగలు చేతికందే దగ్గర్లోనే ఉండటంతో మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫర్మర్ చుట్టూ కంచె నిర్మించాల్సిన అధికారులు నిర్మించకపోవడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవౌతున్నారు. ప్రధాన సమస్యలైన మురుగునీరు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను గ్రామ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పారుదల కాని మురుగునీరు

చెక్ బౌన్స్ కేసులో 2ఏళ్లు జైలు

ప్రజాశక్తి - వినుకొండ:చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి 8 లక్షల జరిమానా, రెండు ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జ్ యు. రామ్మోహన్ గురువారం తీర్పునిచ్చారు. వినుకొండ పట్టణానికి చెందిన పఠాన్ దర్వేష్ ఖాన్ వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన అడపాల రత్తయ్యకు ఆర్థిక లావాదేవీల అంశమై బ్యాంకు చెక్కులు ఇచ్చారు. నగదు డ్రా చేసేందుకు రత్తయ్య చెక్కును బ్యాంకుకు సమర్పించగా ఖాతాలో నగదు లేని కారణంగా చెక్ బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాదు దారుడు రత్తయ్య వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2016 సంవత్సరంలో చెక్ బౌన్స్ కేసు వేశారు. విచారణ పూర్తి అయిన అనంతరం బుధవారం న్యాయమూర్తి యు. రామ్మోహన్ తీర్పును వెలువరిచారు. 8 లక్షల రూపాయల జరిమానాతో పాటు, రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-ఫిరంగిపురం

అక్రమ మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని పొనుగుపాడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రుద్రపాటి సుందరమ్మ భర్త జగన్మోహన్ ఎస్సీ కాలనీలో అక్రమంగా ఎలాంటి లైసెన్స్ లేకుండా మద్యం అమ్ముతుండగా ఫిరంగిపురం ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డికి రాబడిన సమాచారం మేరకు తన సిబ్బందితో ఆమెను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద 72 మద్యం సీసాలు (180ఎంఎల్) స్వాధీన పరుచుకుని ఆమెను నరసరావుపేట సెకండ్ ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరు పరచగా ఆమెను రిమాండ్‌కు తరలించారు.

కుటుంబ కలహాలతో హత్య

● బావను కత్తితో పొడిచిన బావమరిది ● ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



మృతుడు గోపి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో బావను బావమర్ది కత్తితో పొడిచి హత మార్చిన సంఘటన గురువారం జానపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన గోపి వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం గ్రామానికి చెందిన లక్ష్మీని వివాహం చేసుకున్నారు. గత కొంత కాలంగా వారి మధ్య గొడవలు జరుగుతుండటంతో పెద్దలు సర్ది చెప్పారు. మరికొద్ది రోజులుగా మరల గొడవలు జరుగుతుండటంతో లక్ష్మీ తల్లిదండ్రులకు తెలియజేసింది. తల్లిదండ్రులు, బావమర్ది ఏడుకొండలు జానపాడు గ్రామానికి వచ్చి లక్ష్మీని తీసుకొని వెళు ..ండగా గోపి అడ్డం వచ్చి తన ఆటోలో ఉన్న కత్తిని తీసుకొని బావమర్ది ఏడుకొండలుపై దాడి చేయబోయాడు. వెంటనే ఏడుకొండలు బావ చేతిలో ఉన్న కత్తిని లాక్కొని బావ గోపి గొంతులో పొడిచారు. గోపి(35) హాస్పటల్‌కు వెళ్లే మార్గంలోనే మృతి చెందాడు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్: పట్టణంలో జలవనరుల శాఖా కార్యాలయం ఆవరణలో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం పోలీసులు గుర్తించారు.మృతుడు పిడుగురాళ్ళ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు. చేతి మణికట్టు వద్ద సీసంతో కోసుకున్నట్టు ఆనవాలు ఉన్నాయని అధిక రక్తస్రావం జరిగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుని జేబులో కొండమోడు నుండి సత్తెనపల్లి వరకు ఆర్టీసి బస్ టిక్కెట్ తీసుకున్నట్టు ఉందని వెల్లడించారు.మృతుడు మోటారు ఫీల్డ్‌కు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సిఐ శోభన్ బాబు చెప్పారు

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి -మంగళగిరి:నార్త్ సబ్ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కాగా గుంటూరు నగరంలోని వేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడు. శ్రీనివాసరావు 1996వ సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి 2015వ సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు మృతిపట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

పిడుగురాళ్ల :లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలోని కొండమోడు సమీపంలోని బాలాజీ కాటన్ మిల్లు వద్ద గురువారం చోటు చేసుకుంది. పట్టనానికి చెందిన లక్ష్మీ, అతని భర్త, కుమార్తె ద్విచక్ర వాహనంపై నర్సరావుపేట వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనటంతో లక్ష్మీ(40)కి తీవ్ర గాయాలు అయ్యాయి. లక్ష్మీని గుంటూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది .పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న గ్రామస్తులు, ఇన్‌సెట్‌లో మానస (ఫైల్)

తుంగభద్ర డ్రైన్‌లో పడిన వాలంటీర్ మృతి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

తుంగ భద్ర డ్రైన్‌లో పడి వాలంటీర్ మృతి చెందిన సంఘటన మండలంలోని మన్నవ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వాలంటీర్ అన్నవరపు మానస బట్టలు ఉతకటానికి వెళ్లి ప్రమాదవశాత్తు తుంగభద్ర డ్రైన్‌లో కాలు జారీ పడిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన గాలింపు చర్యలు చేపట్టారు. కొంత దూరం కొట్టుకుపోయిన మానసను బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. ఈ సంఘటనతో గ్రామంలో పెద్ద ఎత్తున విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొన్నూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై పొన్నూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య కేసు కొట్టివేత

ప్రజాశక్తి-మంగళగిరి: పట్టణం ప్రకాష్ నగర్‌కు చెందిన ఓ వివాహిత మహిళ ఆత్మహత్య కేసును కొట్టివేస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు గురువారం తీర్పు చెప్పారు. ప్రకాష్ నగర్‌కు చెందిన దాసరి వెంకటలక్ష్మి (26)ఇంటిలో పైకప్పుకు చీరతో ఉరివేసుకొని 10.01.2018న అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీంతో మృతురాలి భర్త దాసరి ఆనంద్, అత్త కనకలక్ష్మి, మామ నరసింహారావులపై అనుమానం ఉందంటూ కృష్ణాజిల్లా మంటలకు చెందిన మృతురాలి తండ్రి కాలపురెడ్డి లక్ష్మణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్ఐ ప్రతాప్ కుమార్ అనుమానాస్పద మృతి 174 కింద కేసు నమోదు చేయగా తదుపరి ఎస్ఐ ఏ శ్రీనివాసరావు ఐపిసి 306 సెక్షన్ కింద చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణకు రాగా వాదోపవాదాల అనంతరం నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు గురువారం తీర్పు చెప్పారు. సీనియర్ న్యాయవాది వేమూరి రత్న ప్రసాద్, ఎంగోవర్ధన్‌లు డిఫెన్స్ నిర్వహించారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	98,889
మిర్చి ఎగుమతి	:	106,849
మిర్చి నిల్వ	:	44,218

మిర్చి ధరలు

రూపాయలలో

334	9000 - 23000
నెం.5	10000 - 22000
273	13500 - 21500
341	9000 - 22000
4884	15000 - 17300
సూపర్ -10	10500 - 15500
నాన్ ఎసి	
తేజ	9000 - 23800
బడిగి	11000 - 22500
దేవనూరుడీలక్స్	9500 - 19500
తాలుకాయలు	5500 - 13000

ఉపాధి కూలీలు.. 22న ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఏ రోజు కారోజు కూలీలు చేసిన పనికి వ్యక్తిగతంగా కొలతలు తీసి, ఆ మేరకు వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ రక్షణ కోసం పని ప్రదేశాల వద్దకు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెంటపాళ్ళ, కందులవారిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరును వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వంరెడ్డి, కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం అనే కొత్త విధానాన్ని తీసుకువచ్చిందని, ఈ విధానం వల్ల ఉపాధి హామీ పనులు చేయించటం, కొలతలు తీయడం మరింత క్లిష్టంగా మారిందని అన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉపాధి పనుల పర్యవేక్షణ ఉండేదని, ఇప్పుడు ఎన్ఎంఎంయస్ యాప్ తీసుకొచ్చిన తర్వాత వీటి పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్లిందని చెప్పారు. గతంలో 20 మందికి ఒక శ్రమశక్తి గ్రూపు, దానికి ఒక మేటు (మేస్త్రి) ఉండేవారని, అతను ఆ 20 మందికి కొలతలు ఇచ్చి పని చేయించే వారిని, వారానికి ఒకసారి చేసిన పని కొలతలు తీసి వేతనాలు చెల్లించే వారని అన్నారు. ఇప్పుడు కొత్త విధానంలో వందలాది మంది చేసిన పనులను వారం రోజులు పాటు చేసిన తర్వాత ఒకేసారి కొలతలు చేసి సగటు వేతనాలు చెల్లిస్తున్నారని, దీనివల్ల కష్టపడి కొలతల ప్రకారం పని చేసిన వారికి, పైపైన పని చేసుకుంటూ పోయిన వారికి తేడా లేకుండా పోతుందని వివరించారు. ఉపాధి పనులు వృథా అంటూ దుష్ప్రచారం చేసి ఈ పథకాన్ని నీరు గార్చేందుకు ఇది దారితీస్తుందని అన్నారు. అందువల్ల ఉపాధి కూలీలు వ్యక్తిగతంగా చేసిన పనిని విడివిడిగా కొలతలు తీసి, వాటి ప్రకారం వేతనాలు చెల్లిస్తే


కందులవారిపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస పల్నాడు జిల్లా కార్యదర్శి లక్ష్మీశ్వరరెడ్డి

పనిచేసే వారికి ప్రోత్సాహం లభిస్తుందని, ఉపాధి హామీ పనులను మరింత నాణ్యంగా చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. 'ఉపాధి హామీ'ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని అన్నారు.ఈ పథకాన్ని రక్షించుకోవడానికి, పాత పద్ధతిలోనే మెట్లు వ్యవస్థను కొనసాగించాలని, మెట్లకు ఒక్కొక్కరికి రూ.10 చొప్పున అదనపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల డిమాండ్ల సాధన కోసం మే 22వ తేదీన నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలనలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి జె.భగత్, బి. వెంకటేశ్వర్లు, సిహెచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'ది కేరళ స్టోరీస్'ను నిషేధించండి

ప్రజాశక్తి - వినుకొండ

'ది కేరళ స్టోరీస్' సినిమా ను ఆంధ్రప్రదేశ్ లో బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తూ వినుకొండ మజ్లిస్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మజ్లిస్ పార్టీ అధ్యక్షులు బాజీద్ మాట్లాడుతూ గడిచిన కొన్ని రోజుల క్రితం విడుదలైన ది కేరళ స్టోరీ అనే చిత్రం 32,000 వేల మంది హిందూ యువతులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చి ఉగ్రవాద సంస్థ అయిన ఐసిస్ లో చేర్చబడుతున్నారన్న ఒక కల్పిత కథనంతో ఆ చిత్ర దర్శకుడు సుదీప్ తోసేన్ చిత్రీకరించారని, ఆ చిత్రం ద్వారా హిందూ-ముస్లింల మధ్య వైషమ్యాలు, మత ఘర్షణలు జరిగే విధంగా దర్శకుడు చిత్రీకరించి ఆ సినిమాను ఈ నెల 5న విడుదల చేయటం జరిగిందని తెలిపారు. ఆ చిత్రంలో చూపించిన విధంగా నిజమే అయితే 32,000 మందిపై పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని అన్నారు. ఇప్పటికే ఆ చిత్రంపై తమిళనాడు,పశ్చిమ బెంగాల్,కేరళ రాష్ట్రాల్లో నిషేధం ఉందని చెప్పారు. ఈ సినిమా దర్శక, నిర్మాతలకు



ఇటీవలే గుజరాత్ కు సంబంధించి జాతీయ నేర గణాంకాల సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం గుజరాత్ లో కనబడకుండా పోయిన 42 వేల మంది యువతులపై సినిమా తీసే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆ చిత్రాన్ని నిషేధించాలని, చిత్రం పూర్తి అవాస్తవమని వినుకొండ అఖిలపక్షం,ప్రజా సంఘాల తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్రంలో ఎక్కడ కూడా ప్రదర్శించకూడదని డిమాండ్ చేశారు. మజ్లీస్ పార్టీ అధ్యక్షులు బాజీద్, కలా ముద్దీన్, వలిఖాన్,మైనార్టీ నాయకులు ఆయాజ్, సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు టి. ఆంజనేయులు, ఫిరోజ్, సీతయ్య, మాల మహానాడు వెంక టేశ్వర్లు, బీసీ సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-దాచేపల్లి

గురజాల మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో మే డే సందర్భం గా పాతపాటేశ్వరి గుడి సెంటర్‌లో గురువారం సిఐటియు జెండాను పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అమరవీరుల త్యాగ ఫలితంగా మే డే జరుపు కుంటున్నామని వారి ప్రాణత్యాగంతో ఈ హక్కులు పొందామని భవిష్యత్తులో పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ పెట్టుబడి దారులకు లాభాలు చేకూర్చే విధానాలను చేపడుతున్నారని, ఆయా విధానాలను రాష్ట్రంలో పాలకవర్గ ముఖ్యమంత్రి జగన్, ప్రతిపక్ష నేత చంద్ర బాబు నాయుడు ఆమోదిస్తున్నారని విమ ర్శిం చారు. సిఐటియు నాయకులు జి.సురేష్ ఆశా వర్కర్స్ కె.జ్యోతి, కె.సీత ,రాజ్యం, హైమావతి, శారద, పి.జ్యోతి మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు ఎస్ ప్రమీల, ఎస్కే మాబుల, సామ్రాజ్యం, జి.లక్ష్మి పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని జెట్టి పాలెం లోని ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ప్రిన్సిపల్ కె పాపయ్య గురువారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓసి, బిసి విద్యార్థులు 2011 సెప్టెంబరు ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉం



డాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబరు ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 తేదీ మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ ఎస్టీలు రూ.75, ఓసీ,బీసీలు రూ.150 చెల్లించాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2021- 22, 2022-23 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదివి ఉండాలని, జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఓసి, బీసీ విద్యార్థులకు కనీసం రూ.35 మార్కులు ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.30 మార్కులు రావాలని, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే స్కూల్లో చదివే అవకాశం ఉంటుందని వివరించారు.

పిఎస్‌వికేలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజల దాహార్తిని తీర్చేందుకే మజ్జిగ చలి వేం ద్రం ఏర్పాటు చేశామని ప్రముఖ న్యాయవాది పిన్న మనేని పాములయ్య అన్నారు. స్థానిక పాత బస్టాండ్ సెంటరలో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాములయ్య మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఎండలు మండుతున్నాయని, పట్టణానికి పరిసర గ్రామాల ప్రజలు, వృద్ధులు వివిధ పనుల రీత్యా ప్రతిరోజు వస్తుంటారని, వారికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పిఎస్‌వికె ఆధ్వ ర్యంలో ప్రజలకు, బాలలకు, యువతీ యువకులకు, ఉచిత న్యాయ సలహా కేంద్రం, బాలోత్సవం, సాం స్కృతిక కార్యక్రమాలు, అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని, అందులో భాగంగానే ఈ మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం నాటి దాతలు రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, గద్దె ఉమశ్రీ దంపతులు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ



సందర్భంగా పిఎస్‌వికె కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు మాట్లా డుతూ ఈ చలివేంద్ర నిర్వహణకు పట్టణంలోని వ్యాపారులు, ఉద్యో గులు, ప్రముఖులు, దాతలు రోజుకొకరు చొప్పున ఆర్థిక సాయం అందజేసి చలివేంద్ర నిర్వహణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌వికె నిర్వాహకులు కె.జగ న్మోహన్, జె.రాజ్‌కుమార్, ఆర్. పురుషోత్తం, డి విమల, కె. శివ దుర్గారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిహెచ్ఒల సంఘం

సిహెచ్ఒల ఉద్యోగాలు రెగ్యులర్ చేయండి

ప్రజాశక్తి - వినుకొండ

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) పరిధిలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్ఒ) లను రెగ్యులర్ చేయాలని సిహెచ్ఒ ల సంఘం డిమాండ్ చేస్తూ గురువారం వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో సిహెచ్ఒలుగా నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా నియామకం జరిగిందని, 2019 నుండి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్ఎం పరిధిలోని అన్ని క్యాడర్ ఉద్యోగులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి వేతన సవరణ చేసి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్‌హెచ్ఎం పరిధిలో 189 కి కాను 188 విభాగాల్లో పనిచేస్తున్న వారికి క్యాడర్ పెంచి జీత భత్యాలు పెంచారని, అలాగే, సిహెచ్ వాళ్ళకు కూడా క్యాడర్ పెంపు జరిపి జీతాలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.



శిక్షణ తీసుకున్న మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-మాచర్ల

బ్యూటిఫికేషన్ కోర్సులో ఉచిత శిక్షణ తీసుకున్న మహిళలు తమ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సత్యసాయి సేవా సమితి శిక్షణ కేంద్రంలో ఆభయ ఫౌండేషన్, సీడ్స్ సంస్థ, సత్య సాయి సేవా సమితిల ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు 45 రోజుల బ్యూటిఫికేషన్ శిక్షణ పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. 50 శాతం సబ్సిడిపై ఆభయ ఫౌండేషన్ సహకారంతో బ్యూటిఫికేషన్ కిట్స్‌ను అందజేశారు. సత్యసాయి ఎడ్యుకేషన్ అధ్యక్షులు అక్కినేని అనిల్, జక్కా శ్రీనివాసరావులు మాట్లాడుతూ తమ సంస్థ ఉచి తంగా ఉపాధి అవకాశాలున్న కోర్సులను పలు సంస్థల సహ కారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల చివర నుండి మహిళలకు కుట్టుమిషన్, ఫ్యాషన్ డిజైనింగ్ మొదలైన వాటిపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గం టల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇస్తా మన్నా రు. వారికి మధ్యాహ్న భోజనం కూడా తామే నిర్వ హిస్తు న్న ట్లు చెప్పారు. డాక్టర్లు బృందం లక్ష్మీప్రసన్న, ఉదయబాను, హెచ్ఎం వై.రమాదేవి, సేవా సమితి ప్రతి నిధు లు నాగసురేష్‌కుమార్, సీతామహాలక్ష్మమ్మ, ట్రైనర్ భవాని పాల్గొన్నారు.

104, 108 సిబ్బందికి జీతాలు ఇవ్వండి

ప్రజాశక్తి-రెంటచింతల

ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రతిరోజు మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న 104, 108 సిబ్బందికి రెండు నెల లుగా జీతాలు లేవు అని కొద్దిపాటి జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడు తున్నామని తక్షణమే జీతాలు చెల్లించాలని వేడుకున్నారు.

త్వరలో పేదలకు స్థలాలు

రాజధాని గ్రామాల్లో జెసి పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధానిలో త్వరలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజ కుమారి తెలిపారు. సిఆర్‌డిఏ పరిధిలోని నెక్కల్లు, ఐనవోలు, మండడం, కష్ణాయపాలెం, నవులూరు గ్రామాలలో ఏర్పాటు చేసిన పేదలందరికీ ఇళ్ల పథకం లే ఔట్ అభివద్ధి పనులను పరిశీలించారు. లే ఔట్లలో సర్వే, ఇంజనీరింగ్ అధికారులు స్థలాల మార్కింగ్ చేస్తున్న విధానాన్ని, హద్దురాళ్ళ ఏర్పాటు, ఇతర అభివద్ధి పనులను రాజ కుమారి పరిశీలించారు. లే ఔట్ మ్యాప్ లో నిర్దేశించిన కొలతల ప్రకారం అంతర్గత రహదారులు, కమ్యూనిటి స్థలాలు, ఇంటి స్థలాలు భూమిపైన సక్రమంగా మార్కింగ్ జరిగేలా ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించాలన్నారు. సిఆర్‌డిఏ పరిధిలోని పది లే ఔట్లలో జిల్లాకు సంబంధించి దాదాపు 25 వేల మంది లబ్దిదారులకు ఇంటి స్థలాల పంపిణీ చేయవలసి వున్నందున, నిర్దేశిత సమయానికి ఇంటి పట్టాల పంపిణీకి అనుకూలంగా లే ఔట్ లో రహదారుల ఏర్పాటు,



ఇంటి స్థలాల మార్కింగ్, హద్దురాళ్ళ ఏర్పాటు, నంబరింగ్ పనులు సక్రమంగా పూర్తి అయ్యేలా ఇంజనీరింగ్, సర్వే , రెవెన్యూ , సీఆర్డీఏ అధికారులను, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ లే అవుట్ ప్రత్యేక అధికారులు ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. లే అవుట్ల పరిశీలనా కార్యక్రమంలో ఆర్ డి ఓ ప్రభాకర రెడ్డి, సీఆర్డీఏ, రెవెన్యూ, సర్వే, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాట్లు చూపాలంటే అరెస్టులా..!

రైతు అరెస్టును ఖండించిన రైతు సంఘం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అమరావతి రాజధాని కోసం భూమి ఇచ్చిన రైతులకు అరెస్టల బహుమానం తప్పడం లేదు. ప్లాట్లు కేటాయించమని కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా సదరు రైతుకు ప్లాట్ కేటాయించక పోగా అరెస్టలకు గురి చేసిన సంఘటన మంగళగిరి రూరల్ సర్కిల్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. నిడమర్రు గ్రామానికి చెందిన గైరుబోయిన నాగేశ్వరరావుకు ఒక ఎకరం 57 సెంట్లు భూమిని గత ప్రభుత్వ హయాంలో రాజధానికి పూలింగ్‌నకు ఇచ్చారు. అందుకుగాను ఆయనకు 500, వెయ్యి, 390 గజాల ప్లాట్లను చూపించాలి. అయితే ఆ రైతుకు కేవలం 390 గజాల ప్లాట్‌ను మాత్రమే



మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద రైతుతో జొన్నా శివశంకర్ తదితరులు

అప్పగించారు. మిగతా 500 గజాల స్థలం క్వారీ చెరువులో, వెయ్యి గజాల స్థలం పూలింగ్‌కు ఇవ్వని పొలంలో వచ్చింది. ఈ విషయాన్ని సదరు రైతు అప్పట్లో ఉన్న అధికారులకు దగ్గరకు వెళ్లి విషయాన్ని తెలియజేసి ప్లాట్లను మార్చమని అర్జీ పెట్టుకున్నారు. ఆమేరకు అధికారులు కూడా హామీని ఇచ్చారు. అయితే తర్వాత కాలంలో వారికి ప్లాట్లను కేటాయించలేదు. దీంతో భూ బదలాయింపు జరగలేదు. ఆ తర్వాత ప్రభుత్వం మారడం, రాజధానిపై సందిగ్ధత ఏర్పడడం, అధికారుల చుట్టూ తిరిగిన సమస్య పరిష్కారం కాకపోవడంతో వచ్చిన ప్రతి అధికారిని రైతు నాగేశ్వరావు సమస్య పరిష్కరించాలని కోరుతూ వచ్చాడు. సమస్య పరిష్కరించక పోగా అతని పొలాన్ని ఆర్5 జోన్‌లో పెట్టి పేదలకు పంపిణీ చేయడానికి హద్దురాళ్లుకూడా వేశారు. భూమి ఇవ్వకుండా తన భూమిలో ప్లాట్లు వేయడాన్ని ప్రశ్నించిన రైతు నాగేశ్వరరావును మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేసన్‌కు తరలించారు. రైతు అరెస్టును రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ , రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు తప్పుపట్టారు. ప్లాటు చూపమని కోరితే అరెస్టులు చేయడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళగిరి పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టు అయిన రైతును పరామర్శించారు.

22న కలెక్టరేట్ వద్ద ఆందోళన

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యకాస, సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకాని మండలంలో ఉపాధి కూలీలకు గత సంవత్సరం రావలసిన రూ.12 లక్షల 88 వేల 686 వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. గురువారంపెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించి ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. పెదకాకాని మండలం కొప్పురావూరులో గత సంవత్సరం రావాల్సిన రూ.93,544 వేతనాలు రావాల్సి ఉందని వాటిని వెంటనే చెల్లించాలని వారు కోరారు . పనిచేసిన వాటికి కూడా డబ్బులు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని అధికారులను వారు ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని దానిలో భాగంగానే నిధులు తగ్గించేసారని తెలిపారు. అలాగే రెండు పూటలా పని విధానం తీసుకువచ్చారు దీనివల్ల ఉదయం పూట నాలుగు కిలోమీటర్లు సాయంత్రం పూట నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి పనిచేయాల్సిన పరిస్థితి ఉందని దీనివల్ల కూలీలకు ఈ పని పట్ల ఆసక్తి తగ్గుతుందని



మాట్లాడుతున్న ఈమని అప్పారావు, ఎన్ శివాజి

తెలిపారు. అలాగే గతంలో ఇచ్చిన సదుపాయాలను కూడా తీసివేశారని, ఎక్కడ కూడా మెడికల్ కిట్లు గాని, టెంట్లు గాని, పలుగు, పారకు డబ్బులు ఇవ్వటం లేదని ఇది దారుణం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని అలాగే గతంలో ఇచ్చిన సదుపాయాలు కూడా కల్పించాలని కోరారు. లేనిచో మే 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.



అనంతవరంలో నిరసన

కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామం అనంతవరంకు చెందిన పారిశుధ్య కార్మికుడు శేషయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, తమపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ నెక్కల్లులో పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరసనలు గురువారం 4వ రోజుకు చేరాయి. అనంతవరం పారిశుధ్య కార్మికులు పనులు మానేసి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తుళ్లూరులోరాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ అనంతవరం, నెక్కల్లు గ్రామాల్లో సూపర్ వైజర్ మన్మధరావు వల్ల కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అతనిపై అధికారులు చర్యలు తీసుకోకపోగా, వెనకేసుకు రావడంతో కోఆర్డినేటర్‌తో కలిసి కార్మికులను పదేపదే విధుల్లోకి రాకుండా అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. మన్మధ రావును తక్షణం సూపర్ వైజర్ బాధ్యతల నుండి తప్పించాలని రవి డిమాండ్ చేశారు. శేషయ్య పై కక్ష సాధింపు చర్యలు మాని తక్షణం పనిలోకి తీసుకోవాలని కోరారు.

పేదలకు సొంతూరులోనే ఇళ్ల స్థలాలివ్వాలి

అమరావతి దళిత జెఎసి డిమాండ్ - నేడు సిఆర్‌డిఏ అధికారులకు వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు :పేదలకు వారి సొంత ఊరు లోనే ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఒక్కొక్కరికీ కనీసం రెండున్నర సెంట్లు స్థలం పంపిణీ చేయాలని అమరావతి దళిత జెఎసి కన్వీనర్ గడ్డం మార్టిన్ లూథర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మందడంలో అమరావతి దళిత జెఎసి సర్వ సభ్య సమావేశం జరిగినది.సమావేశంలో మార్టిన్ లూథర్ బాబు మాట్లాడుతూ, అమరావతి మాస్టర్ ప్లాన్ విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం ఆర్5 జోన్ లో సెంటు భూమి చొప్పున ఇతర ప్రాంత వైసీపీ కార్యకర్తలకు పప్పు బెల్లం మాదిరి పంచడాన్ని దళిత జెఎసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. అమరావతి ప్రాంత దళిత, గిరిజన,బహుజన, ముస్లిం, మైనారిటీలకు ఇవ్వాల్సిన టీడ్కో గృహాలు పంపిణీ చేయకుండా, అసైన్డ్ రైతులైన దళితులు, ఇతర పేదలకు ప్లాట్లు పంపిణీ, కౌలు చెల్లించకుండా రాజధాని బయటి గ్రామాల పేదలకు కేవలం ఒక సెంటు స్థలం ఇచ్చి ఉద్ధరిస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటం చేయడం వెనుక అమరావతిని నాశనం చేయాలనే కుట్ర దాగుందని మండిపడ్డారు. ఆర్3 జోన్‌లో అమరావతి ప్రాంత నిరుపేదలకు రెండు సెంట్లు చొప్పున పంచాల్సిన భూమిని వదిలిపెట్టి ఆర్ 5 జోన్‌లో రాజధానేతర పేదలకు పంపిణీ చేయడం ఏమిటని అమరావతి దళిత జెఎసి మహిళా విభాగం కన్వీనర్ అంకం సువర్ణ కమల, మేరిగ నాగేశ్వరరావు ప్రశ్నించారు. అమరావతిని మురికివాడగా మార్చే ప్రభుత్వ దుర్మార్గ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని, ప్రభుత్వంపై రాజధాని అమరావతి పేదలంతా తిరగబడి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో జె ఏడుకొండలు, చేకుర్తి రవి ఎస్సీ రైతులు పాల్గొన్నారు.



మందడం లో జరిగిన అమరావతి దళిత జెఎసి సమావేశం

పేదలకు సెంటు స్థలంపై

నేడు సిఆర్‌డిఏ అధికారులకు రైతుల వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు :రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ కు విచ్ఛిన్నం చేసేలా ఆర్ - 5 జోన్ లో పేదలకు సెంటు స్థలం పంపిణీ పై తమ అభ్యంతరాలను తెలియజేస్తూ రాజధాని రైతులు శుక్రవారం సిఆర్‌డిఏ అధికారులకు వినతి పత్రం ఇవ్వనున్నారు. ఉదయం 10 గంటలకు తుళ్లూరు రైతు దీక్షా శిబిరం దగ్గర నుంచి ప్రదర్శనగా సి ఆర్ డి ఎ కార్యాలయం వద్ద కు వెళ్లి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించినట్లు సమన్వయ కమిటీ, అమరావతి ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు.



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, సరఫరాలో సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దష్టికి తీసుకు రావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆవుల సంరక్షణ కేంద్రం, వెంకట రమణ కాలనీలో ఎన్.ఓ.సి.కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత వెంగళాయపాలెం చెరువుని పరిశీలించి, పూర్తి స్థాయి సామర్ధ్యం మేరకు నీటిని నిల్వ చేయడానికి, మోటార్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. చెరువు పూర్తి స్థాయిలో నీటితో ఉంటే నగరంలోని ఏటి అగ్రహారం, హౌసింగ్ బోర్డు తదితర రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సంవృద్ధిగా తాగునీటిని సరఫరా చేయగలమన్నారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఎన్.ఓ.సి.కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, డిప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, ఏసిపి బాబురావు, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కెఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎపిఎస్ ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం పాతగుంటూరులోని పి.ఎస్. భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి హాజరైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 2020, 2021 సంవత్సరంలో రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని, సూపర్ లగ్జరీలో ఫ్రీ ట్రావెలింగ్ బస్‌పాస్ ఇవ్వాలని, మట్టిఖర్చుల కింద రూ.25వేలు ఇవ్వాలని, మెడికల్ స్కీమ్‌లో రూ.4 లక్షలకు అదనంగా రూ.7లక్షలు ఇవ్వాలని నాయకులు కోరారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం ఆఫీసు కంప్యూటర్‌ను కెఎస్ ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు, నాంచారయ్య, శేషగిరిరావు, జివిజి రాజు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు వినోదం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి లింగంశెట్టి అసోసియేషన్, ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామకృష్ణ థియేటర్‌లో అనాథ పిల్లలకు వినోదం పంచారు. అమరావతి కరకట్టపై గల చిగురు ఆశ్రమంతో పాటు విజయవాడ నగరంలోని అనాథ పిల్లలకు చక్కని కుటుంబ కథా చిత్రం రామబాణం ప్రదర్శించారు. ఆర్థికలేమితో ఇబ్బంది పడుతున్న అనాథలకు లింగంశెట్టి అసోసియేషన్‌తో పాటు మరికొందరు దాతల సహాయంతో అనాథ పిల్లలకు సినిమాను ప్రదర్శించారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న వారిలో మనోవేదన కొంత మేరకైనా తగ్గించగలిగామని లింగంశెట్టి కిషోర్ తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు ఈ సందర్భంగా లింగంశెట్టి అసోసియేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.



రిలే నిరాహారదీక్ష చేస్తున్న పెదమక్కెన బాధితులు

15న 'చలో పల్నాడు కలెక్టరేట్'

బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సాంఘిక బహిష్కరణకు గురైయిన బాధితులకు పరిహారం చెల్లించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా పెదమక్కెన బాధితులు సత్తెనపల్లి తాలూకా సెంటరులో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. బాధితులు నిరాహారదీక్షలు చేస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోవటం లేదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నబాబు అన్నారు. దానికి నిరసనగా మే 15వ తేదీన చలో పల్నాడు కలెక్టరేట్ కు పిలుపునిస్తున్నట్లు చిన్నబాబు గురువారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద మక్కెన సాంఘిక బహిష్కరణ బాధితుల డిమాండ్లతో పాటు క్రొత్తగా ఏర్పడిన పలనాడు జిల్లాలో దళిత యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రం నరసరావుపేటలో 25 అడు గుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని అంబేద్కర్ భవనం అంబేద్కర్ మ్యూజియం ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదాతల ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వం: టిడిపి

ప్రజాశక్తి-రాజుపాలెం

రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతులు భారీగా పంట నష్టపోతే కనీసం వైసిపి ప్రభుత్వం రైతుల వైపు కూడా చూడటం లేదని తెలుగుయువత మండల అధ్యక్షులు రఘువ యాదవ్ విమర్శించారు. గురువారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ అధికారంలోకి రావ డానికి మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని చెప్పిన జగన్ రెడ్డి, ప్రస్తుతం రైతుల వద్ద తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయడం లేదని ఆవే దన వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు అంబటికి నియో జకవర్గంలో వర్షాలకు నష్టపోయిన పంటలను పరి శీలించే తీరిక కూడా లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదు కోవాలని డిమాండు చేశారు.

ఆర్ బి కే లో పచ్చి రొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని ఆర్బికేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అంద జేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ శాఖాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి గురువారం తెలిపారు. ఈ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందిస్తా మన్నారు పిల్లి పెసర 10 కిలోలు 485 రూపాయలు, జీలుగా 10 కిలోలు 395, జనుము 10 కిలోలు 420 రూపాయలు అందజేస్తామన్నారు కావాల్సిన రైతులు వారికున్న పొలం విస్తీర్ణం మేరకు నగదు ముందుగా ఆర్ బి కిలో చెల్లించాలన్నారు విత్తనాల విషయమై రైతులు ఎంపిక చేసుకున్న మేర తెప్పించి అందజేస్తామన్నారు ముందుగా ఆర్బిఐ లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గిరిజన రైతులకు అటవీ భూముల పట్టాలు

ప్రజాశక్తి-మాచర్ల

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభు త్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో రేగులవరం తండాకు చెందిన 65 మంది గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం పరిధిలో అటవీ భూము లు సాగు చేసుకునేందుకు పట్టాలను గురు వారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిం చిందని చెప్పారు. అడవుల సమీపంలో ఉండే గిరిజనులకు సాగుకు యోగ్యమైన భూమిలో వారు స్వేచ్ఛగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా సాగు చేసుకుని ఎదగవచ్చాని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మల్లు స్వామి, ఫారెస్టు ఆఫీసర్ మహబూబ్, వెంక టేశ్వరరావు పాల్గొన్నారు.



రేగులవరం తండా వాసులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి

ఇష్టంగా చదివితే 'ఆంగ్లం'పై పట్టు

ప్రజాశక్తి-నరసరావుపేట



పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ కార్యక్రమం 3వ రోజైన గురువారం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయులు ఎన్. నరసింహారావు పాల్గొని విద్యార్థులకు ఆంగ్లంను సులభంగా మాట్లాడడం, అర్థం చేసుకోవడం,రాయడం వంటి అం శాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఇంగ్లీషును ఇష్టంగా చదివితే సులువుగా నేర్చుకోవడం, మాట్లాడడం నేర్చుకోవచ్చ న్నారు. తెలుగు,ఇంగ్లీష్ దినపత్రికలు చదవడం వలన ఆంగ్ల మాధ్యమంలో పట్టు సాధించేందుకు అవకాశం ఉంటుం దన్నారు. అనంతరం గణిత శాస్త్ర ఉపా ధ్యాయులు షేక్ అబ్దుల్ రహీం విద్యార్థులకు గణిత శాస్త్రం గురించి వివరించారు. విద్యార్థులకు బోధించిన అనంతరం ఆయా అంశాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. అనం తరం ఉపాధ్యాయులు అబ్దుల్ రహీం ప్రతిభ చాటిన విద్యా ర్థులకు అభినందించారు. ఈ సందర్భంగా పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కన్వీనర్ షేక్.మస్తాన్‌వలి మాట్లా డుతూ విజ్ఞాన కేంద్రంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. వేసవి సెలవులలో విద్యార్థులకు విజ్ఞానం అందించడంతో పాటు కొత్త పరి చయాలతో వారి మధ్య స్నేహపూర్వక వాతావరణం నెల కొల్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజ్ఞాన కేం ద్రం తరపున ఆహ్వానించగానే సేవా భావంతో తరగతుల నిర్వ హణకు వచ్చిన ఉపాధ్యాయులు నరసింహారావు, అబ్దుల్ రహీం లకు తమ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజ్ఞాన కేంద్రం ఆధ్వ ర్యంలో విద్యారినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పం పిణీ చేశారు.

వికలాంగులకు భద్రత పెరుగుతుంది

ప్రజాశక్తి - వినుకొండ

ఈ ఏడాది ఏప్రిల్ 19 నుండి వికలాంగుల హక్కుల చట్టం-2016ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని విభిన్న ప్రతి భావంతుల రాష్ట్ర విభాగ అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో గురువారంఆయన విలేకరులతో మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని, కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురాగా, సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 51 గైడ్‌లైన్స్‌తో దీనిని అమలు చేశారని అన్నారు. హక్కుల భద్రత- ఆత్మీయ అభినందన సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ చట్టం అమలుతో వికలాంగులకు భద్రత పెరుగుతుందని, వారిని చులకనగా చూసిన, మానసికంగా శారీరకంగా అవహేళన చేసిన ఈ చట్టం ద్వారా ఐదైళ్ల జైలు శిక్ష పడుతుందని అన్నారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లో కేసు నమోదు చేయని అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేం దుకు చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ నెల19వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా చట్టంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా ఐదుగురితో కూడిన కమిటీ ఏర్పాటు చేసి చైర్మన్‌గా కలెక్టర్‌ను ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు. విభిన్న ప్రతిభావంతుల విభాగ మూడు జిల్లాల



కోఆర్డినేటర్ కొమ్మిరెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు రక్షణ కల్పించేందుకు హక్కుల చట్టం అమలు చేయడం విక లాంగుల ఆత్మగౌరవానికి నిదర్శనం అన్నారు. జిల్లాలో వెనుక బడిన వినుకొండ ప్రాంత వికలాంగులు మూడు చక్రాల మోటార్ వాహనాలకు దరఖాస్తు చేశారని, వెంటనే వాటిని అందించే విధంగా సహకరించాలని కోరారు. జిల్లాలో వికలాంగులు ఎక్కు వగా ఉన్న ప్రాంతం వినుకొండని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమావేశంలో వికలాంగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్, వైసిపి నాయకులు దాట్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం : టిడిపి

ప్రజాశక్తి-కారెంపూడి

స్థానిక కారెంపూడి ఆర్ అండ్ బి బంగ్లాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ శ్రేణులసవాళ్లను టిడిపి నాయకులు స్వీకరించారు. అభివృద్ధి పై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మీరు సిద్ధమైతే కొలువైన శ్రీ అంకాలమ్మ దేవాలయంలో ప్రమాణానికి సిద్ధం మీరు సిద్ధమా అంటూ టిడిపి నాయకులు సవాల్ విసిరారు.స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి శ్రేణులు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లిన ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి శూన్యమని, నాడు టిడిపి ప్రవేశపెట్టిన పథకాల పేర్లు మార్చారని విమర్శించారు. టిడిపి నాయకులు ఉన్నం లక్ష్మీనారాయణ,పంగులూరి అంజయ్య, గోళ్ళ



సురేష్ యాదవ్,మస్తాన్ జానీ,కటికల బాలకష్ణ,బాలు నాయక్,పేరయ్య, తుపాకులు రత్తయ్య,గోరంట్ల నాగేశ్వరరావు, పంగులూరి లక్ష్మయ్య,బొల్లి హరికష్ణ,కిలారి పవన్,కల్లూరి. మల్లికార్జున, బాపనయ్య, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లు, పూల తోటల పెంపకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-నరసరావుపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాయితీపై పండ్లు, పూల తోటలు పెంప కానికి దరఖాస్తులు ఆహ్వానిసు న్నట్లు ఎపిఓ కట్టా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిమ్మ, బత్తాయి,జామ, థైమన్ జామ, మామిడి , డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు, పూల మొక్కలతో పాటు మల్లె, గులాబీ వంటి పూల తోటల పెంపకంపై ఉత్సాహం ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వారం నుండి 10 రోజులలోపు దర ఖాస్తులు తీసుకోవ డం జరుగు తుందని మొత్తంగా 70 ఎకరాలకు రాయి తీపై మొక్కలు అందజేయడంతో పాటు మొక్కలు నాటేందుకు తీసిన గుంతలకు కూలీల ఖర్చు మొక్కలు నాటిన కూలీల ఖర్చు మొక్కల కొను గోలు రవాణా ఖర్చులు ఇవ్వడం జరుగుతుం దన్నారు.ఒక మొక్కకు రూ.4.25 చొప్పున 100 మొక్కలకు రూ.425, నెలకు నాలుగు సార్లు చొప్పున రూ.1700,100 మొక్కలు పెంచుకొనే రైతుకు రూ 3500, మొక్కలకు నీరు పెట్టేందుకు, పాదులు చేసేందుకు మొక్కల సంరక్షణకు ప్రతి నెలా రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. 5 ఎకరాలలోపు పొలం నీటి వసతి కలిగిన సన్న,చిన్న కారు రైతులు అర్హు లని, మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకు వాచ్ అండ్ గార్డు కింద కుటుం బానికి నెలకు రూ. 1800 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా లావా దేవీలు ఆరు నెలలకు ఒకసారి రైతు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని వివరించారు. మొదటి ఏడాది పూర్తయిన వెంటనే రైతులకు డ్రిప్ ఉచి తంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో పండ్ల, పూల తోటల పెంపకంపై ఆశక్తి ఉన్న రైతులు గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఎంపిటిసి, మండల స్థాయి అధికారులను సం ప్రదించాలని సూచించారు. వివరాలకు 79933 77580 సెల్ నంబరులో సంప్రదిం చాల్సిందిగా కోరారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఈనెల 14వ తేదీన స్థానిక ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ డీజీఎం కార్యంశెట్టి లూర్దు రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తల్లి దండ్రులు జయరావు రోజమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పెదకాకాని చెందిన శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆందోళనకు వెళ్లొద్దని నోటీసులు

ప్రజాశక్తి - తెనాలి

అకాల వర్షాలకు దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పంటనష్టం తక్షణమే చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన ఆందోళనపై పోలీసులు ముందస్తు ఆంక్షలు విధిస్తున్నారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు నోటీసులు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డికి నోటీసులు అందజేశారు.



మట్టి నమూనాలను బయటికి తీస్తున్న సిబ్బంది

ఫూట్ బ్రిడ్జ్ నిర్మాణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి- దుగ్గిరాల: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఫూట్ బ్రిడ్జ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక బాలికల హైస్కూల్ వద్ద కొమ్మమూరు కాలువలపై బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు శతాబ్ది కాలం నుండి రైలు పేట సుగాలీ కాలనీ వాసులు ఎదురు చూస్తున్నారు. గత నెలలో స్థానిక సీసీఎల్ కాఫీ ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ ఫూట్ బ్రిడ్జి నిర్మాణానికి ముందుకొచ్చి శంకుస్థాపనలు నిర్వహించారు. గురువారం పనులు ప్రారంభించారు. మట్టి పరీక్షలు నిర్వహించే నిమిత్తం తవ్వకాలు జరిపారు.

రాజధాని రైతుల దీక్షలకు జనసేన మద్దతు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఆర్5జోన్‌ని వ్యతిరేకిస్తూ కృష్ణాయపాలెంలో రాజధాని రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరంను గురువారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాజధాని ప్రాంత వాసులు రోడ్డున పడ్డారని, ఈ ప్రభుత్వం కోర్టు తీర్పును సైతం లెక్కచేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బేతపూడి.విజయ్ శేఖర్ , జిల్లా నాయకులు ఎన్. ప్రసాద్, ఎన్. శివరామకృష్ణ, వి. శ్రీనివాస రావు, బి. అంజయ్య, తంబీ, సురేష్, రాజీవ్ నాయుడు, కె.సుందరయ్యలు పాల్గొన్నారు.

14న ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు రోటరీ క్లబ్ వారు శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని మరియు గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కొల్లా సుబ్బారావు గుర్తింపుగా కొల్లా సాంబశివరావుల సహకారంతో ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు క్లబ్ అధ్యక్షులు విక్టర్ జాన్ పాల్ తెలిపారు. 14 తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక అశోక హైస్కూలులో నిర్వహిస్తారని చెప్పారు. ఈ శిబిరంలో కంటి శుక్లం పరీక్షలు అవసరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకొవాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

అధిక వర్షాలు వల్ల పంటలు కోల్పోయిన రైతాంగానికి వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు రావి శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మాబు సుభానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రవాస ఆంధ్రుడు ఆళ్ల వెంకట్, దివి నాగరాజు, సురేంద్ర, కె. సుబ్బారావు ,వి. శివయ్య,డి శివరామకృష్ణయ్య, లావు సుబ్బారావులు పోతురాజులు పాల్గొన్నారు

అతనితో మాకు ప్రాణ ' భయం'

- చిన్న పిల్లను సైతం మెడ మీద కాలుపెట్టి చంపేందుకు యత్నం
- రక్షణ కల్పించాలంటూ పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి

ముగ్గురోడ్డుకు చెందిన బొల్లెద్దుల అనిల్‌కుమార్ వల్ల తమకు ప్రాణభయంగా ఉందని గురువారం ముగ్గురోడ్డుకు చెందిన ముస్లిం మైనార్టీ కుటుంబాలు పోలీసుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. రౌడీలు, గంజాయి బ్యాచ్‌లతో కలిసి కర్రలు, రాళ్లతో తమ ఇళ్లపై దాడులు చేశారని పోలీస్‌స్టేషన్ ముందు మీడియాకు తెలిపారు. ఈ దాడుల్లో మహిళకు, మూడేళ్ల పాపకు గాయాలయ్యాయని తెలిపారు. చిన్నపిల్లలను సైతం వదలకుండా మెడ మీద కాలుపెట్టి చంపాలని ప్రయత్నించారని ఆరోపించారు. విజయవాడలో నగర బహిష్కరణకు గురైన కరేబియా అనే రౌడీషీటర్‌కు అనిల్ ఆశ్రయం కల్పించి మైనార్టీలపై దాడులకు తెగబడ్డాడని ఆరోపించారు. రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్ ముందు పడిగాపులు కాస్తున్నామని, ఇంటికి వెళ్లాలన్నా భయం వెంటాడుతుందని వాపోయారు. రౌడీలు, గంజాయి బ్యాచ్‌లతో వారికి ఉన్న పరిచయాల వల్ల తమకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని భయపడుతున్నామని మైనార్టీలు చెబుతున్నారు. ఒక బాలిక కనిపించకుండా పోయిన నేపథ్యంలో చెలరేగిన ఈ వివాదం ముగ్గురోడ్డులో టెన్షన్ వాతావరణం తీసుకొచ్చింది. తనపై ఎవరైనా కేసు పెడితే అందరి అంతూ చూస్తానని అనిల్‌కుమార్ బెదిరిస్తున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఆడియో క్లిప్పింగులను కూడా మీడియా ముందు ప్రదర్శించారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆక్యుప్రెషర్ చికిత్సకు విశేష స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్ వంశీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆక్యుప్రెషర్ చికిత్సా శిబిరానికి గురువారం విశేష స్పందన లభించింది. శిబిరాన్ని క్లబ్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు జరుగుతున్న ఈ శిబిరాన్ని ఈ ప్రాంతంలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. రూ.200 ఫీజుతోనే అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా మహిళా థెరఫిస్టు ద్వారా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కిరణ్ పరుచూరి, రామకృష్ణ శెట్టిపల్లి, కొల్లి వెంకటచంద్రశేఖరరెడ్డి, జొన్నా రాజేష్, సుకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లికి చెందిన పేద విద్యార్థి పట్నాల భావనకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి రూ.17 వేలు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. భావన తెనాలి గుప్తా కాలేజీలో ఎంఎస్‌సి కెమిస్ట్రీ చదువుతోంది. కాలేజీ ఫీజు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నామని విద్యార్థి తండ్రి శంకర్ రోటరీ క్లబ్ ప్రతినిధులను సంప్రదించాడు. దీనిపై స్పందించిన క్లబ్ అధ్యక్షులు ఎం.వివేకానందరెడ్డి రూ.17 వేల చెక్కును అందజేశారు. క్లబ్‌ప్రతినిధులు పాల్గొన్నారు.



బండిని అందజేస్తున్న టిడిపి నాయకులు

చిరు వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి -మంగళగిరి: పట్నంలోని 24 వ వార్డుకు చెందిన పి లోకేశ్వరి, 21వ వార్డుకు చెందిన వి రాము ఇద్దరూ చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో వి రాముకు ప్లాట్ఫామ్ రిక్షా బండి, లోకేశ్వర్‌కి టిఫిన్ బండి టిడిపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, సింహాద్రి రామారావు, కారంపూడి చిరంజీవి, టి బాలాజీ, వాకా మాధవరావు, వాకా మంగారావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడికొండ : ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాడికొండ తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం తాడికొండ గ్రామంలోని సాయిబాబా ఫంక్షన్ హాలు లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా అధ్యక్షత వహించి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు. లేని ఎడల ఈనెల 22వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఉద్యగుల జీతభత్యాలు, పెన్షనర్ల యొక్క పెన్షన్స్ అన్ని 1వ తేదీనే అందే విధంగా చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టబద్ధతలేని సిపియస్‌ను రద్దు చేయాలని కోరారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని 25/11/1993కు ముందు పని చేస్తున్న ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మురళి, తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి సుమిత్ర, నగరశాఖ అధ్యక్షులు వై నాగేశ్వరావు, నగరశాఖ ఉపాధ్యక్షులు పెద రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా తదితరులు



సుబ్బారావు కు జ్ఞాపిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పౌరాణిక కళాకారుడు సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి -తెనాలిరూరల్: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో గురువారం ఎన్టీఆర్ నటించిన సంపూర్ణ రామాయణం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శతాబ్ది ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో ప్రముఖ పౌరాణిక, నాటక, కోలాటం, చెక్కబజన కళాకారుడు మోర్ల సుబ్బారావును గుడివాడ నాయకులు కాజా గోపి, ఎం రాజేష్, ఎ మహేశ్వరరావు, కె సాంబయ్య, సిహెచ్ రాఘవరెడ్డి, పెమ్మసాని పోతురాజు తదితరులు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డిభవాని, ఇ శ్రీనివాసరావు, ఎస్ సాంబ శివరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు,డి భాస్కర్, ఎం వెంకట్, శ్రీనివాస్, సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సుధాకర్ రెడ్డి

జేవికే స్టాక్ పాయింట్‌లు పరిశీలన

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ : గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొన్నూరులో ఉన్న జేవికే స్టాక్ పాయింట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలను స్టాక్ పాయింట్‌లో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం పాఠ్యపుస్తకాలను పంపిణీకి సిద్ధం చేయాలని అన్నారు. పాఠశాలలో నాడు-నేడు పథకం ద్వారా జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి పాఠ్యపుస్తకాల పంపిణీ, నాడు -నేడు పనుల పట్ల శ్రద్ధ వహించి ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. మండలాన్ని అగ్రస్థానంలో నిలపడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ డి.ఐ, ఎండి. ఖాసిం పాఠశాల ప్రధానోపాధ్యాయుని , సీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేమారెడ్డి, నాయకులు

పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి- మంగళగిరి: కపేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ వైసిపి అధ్యక్షులు డి వేమారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా ఎవరికి సీటు ఇచ్చిన వైసిపి అభ్యర్థి ఘన వజయం సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైసిపి మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, వైసిపి మహిళా నాయకురాలు సంకే సునీత, తాడేపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి రామకృష్ణారెడ్డి, జి బాబు పాల్గొన్నారు. అనంతరం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎస్ఎం రఫీ కార్యాలయానికి వెళ్లి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ నాయకులు ఇక్బాల్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కన్వీనర్, జగ్గడిగుంటపాలెం ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చినవెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐటిఐ.ఏపీ.జివోవి.ఇన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తొలుత ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుని, ఆ రిజిస్టర్ నంబరును గుర్తుంచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యార్థి తనకు చెందిన జిల్లాను ఎంపిక చేసుకుని దరఖాస్తును పూర్తి చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారు తమ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల్లో సర్టిఫికెట్ ధ్రువీకరణ చేయించుకోవాలని చెప్పారు. సర్టిఫికెట్ ధ్రువీకరణ, కౌన్సెలింగ్ తేదీలు విద్యార్థి సమర్పించిన మొబైల్ నంబర్‌కు మెసేజ్ ద్వారా తెలియజేయబడుతుందన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ జూన్ 6గా వెల్లడించారు.

కొత్తగా డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సు

జగ్గడిగుంటపాలెం ప్రభుత్వ ఐటిఐ కళాశాల్లో నూతనంగా ఆరు నెలల వ్యవధి కలిగిన డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సును ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కోర్సు వివరాలు, కోర్సులో ప్రవేశం కోరే విద్యార్థులు కళాశాల పనివేళల్లో నేరుగా గాని, 8686689234, 9014491772 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

పనుల్లో జాప్యం వాస్తవమే

త్వరలో ప్రారంభించేందుకు చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి-తెనాలి

'కొలకలూరులో అడుగు పడని అభివృద్ధి' శీర్షికన ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్.విజయాలక్ష్మణ్ దీనిపై వివరణిచ్చారు. గ్రామంలో తాళ్లూరి, అత్యాల వారి నివాసాల ముందుగా సమాధుల తోట రోడ్డు నుంచి మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా రూ.40 లక్షల ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం వాస్తవమేనని, ఆ పనులు ప్రభుత్వ స్థాయిలో నిలిపేశారని తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు ఎంపిటిసిల పరిధిలో రూ.90 లక్షలు మండల పరిషత్ అభివృద్ధి నిధులతో అభివృద్ధి పనులకు తీర్మానించారని, పరిపాలనా అమోదం పొందినా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాత అంచనాలను సవరించి, కొత్తగా అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. పనుల జాప్యాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని, వారి సహకారంతో ఏజెన్సీలను గుర్తించి త్వరిత గతిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రభుత్వం నుండి విడుదలైన వెంటనే జమ

ఉపాధి హామీ కూలీలకు బకాయిలపై అధికారుల స్పందన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఉపాధి హామీ కూలీలకు మూడు వారాలుగా కూలి అందలేదనే అంశంపై ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈనెల 2వ తేదీ నుండి కూలి చెల్లించాల్సి ఉందని, దీనిపై ఎఫ్‌టిఒలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రదిపాదించామని, ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే కూలీల బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతుందని జి చేస్తామని తెలిపారు. కూలీలకు తాగునీటి వసతి కల్పన, రెండు పూటల పని పద్ధతి తొలగింపు, మ్యాన్యువల్ మస్టర్ ఏర్పాటు, టెంటు, మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచడం తదితరాలు కల్పనకు చట్టంలోని నిబంధనల ప్రకారం అవకాశం లేదని తెలిపారు. వీటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

పదిలో ప్రతిభావంతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, సత్కారం



విద్యార్థినికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామ జెడ్‌పి పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చడంతో వారికి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి రూ.5 వేల నగదు ప్రోత్సాహకాలను అందించారు. గతంలో పాఠశాల సందర్శన సమయంలో విద్యార్థులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బహుమతిని హెచ్ఎం టి.సోమనాథ్ ద్వారా పాఠశాల ప్రథమ స్థానం సాధించిన కొల్లిపర శ్రీఇంద్రజ (529/600)కు రూ.3 వేలు, రెండో స్థానం సాధించిన పి.తేజస్విని (525/600)కి రూ.2 వేలు అందించారు.

తెనాలిలో సత్కారం..

ప్రజాశక్తి - తెనాలి

పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అందుకు తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులను గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సత్కరించారు. చైర్‌పర్సన్ సయ్యద్ కాలేదా నసీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 6 మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికకు ఉపాధ్యాయులు వారికి తగిన తోడ్పాటును అందించాలని కోరారు. కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ పదో తరగతి ఎంతో కీలకమైన దశని, ఈ దశలో విద్యార్థులు క్రమశిక్షణతో రాణిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, వైస్‌చైర్మన్ ఎం.హరిప్రసాద్, కౌన్సిలర్లు, ఆయా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర జాతా

- **ఈనెల 31 నుండి జూన్ 9వ తేదీ వరకూ నిర్వహణ**
- **జయప్రదానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు**

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మే 31వ తేదీ నుండి జరిగే రాష్ట్ర జాతాలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో ఫెడరేసన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కోయలమూడి వెంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కోర్ యాక్టివిటీలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 101 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో ఈనెల 31వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జాతా నిర్వహించనున్నట్లు వివరించారు. కార్మికులు ఈ జాతాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామని వాగ్దానం చేసి ఇప్పుడు మాట తప్పుతున్నారని విమర్శించారు. మాట తప్పని, మడమ తిప్పని పార్టీ వైసిపి అని గొప్పలు చెప్పుకొంటున్న రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయకుండా మోసం చేసిందని అన్నారు. కార్మికులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, పి.పూర్ణచంద్రరావు, కె.శివయ్య, వై.శివనాగేశ్వరరావు, శ్రీబాలప్రసాద్, కె.భాగ్యరాజు, జి.ప్రసాదరావు, షేక్ గౌస్‌పీర్, జి.శ్రీనివాసరావు, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.



రాఘురావుకు సన్మానం చేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కిట్స్‌లో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు : కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నేషనల్ టెక్నాలజీ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవెన్యూ ఎడ్జెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎ.రాఘవరావు, టెక్నాలజీడే విశిష్టతను వివరించారు. ప్రస్తుత ప్రపంచంలో టెక్నాలజీలో వస్తున్న మార్పులను వివరణాత్మకంగా తెలియజేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ ల్యాండ్ స్కేప్ ఆఫ్ ఇన్నోవేషన్ ఫర్ ఎ బెటర్ టుమారో అనే అంశంపై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు మాట్లాడుతూ సెంట్రల్ గవర్నమెంట్ పాలసీ అయిన 'స్టూడెంట్ టు స్టార్ట్ అప్' గురించి వివరించారు. కార్యక్రమానికి ఐటి విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ఎస్ సాయి అధ్యక్షత వహించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు అభినందించారు.

కళ్లకు గంతలున్నా చూశారు..!

ప్రజాశక్తి-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో అరవింద హైస్కూల్లో జరుగుతున్న మ్యాజిక్ శిక్షణా తరగతుల్లో గురువారం అద్భుతాన్ని చూపించారు. కళ్లకు గంతలు కట్టుకుని బ్లాక్ బోర్డుపై రాసిన వివిధ రకాల యాపిల్ వంటి పండ్లను విద్యార్థులు తాకగానే వారు ఏ పండు మీద చెయ్యి వేశారో ఆ పండు పేరు చెప్పి పిల్లలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు. అద్భుతం అనే ఈ మ్యాజిక్ ట్రిక్కును అందరూ సులభంగా నేర్చుకుని ప్రదర్శించవచ్చని చెప్పారు. వారం రోజుల నుంచి జరుగుతున్న మ్యాజిక్ శిక్షణా శిబిరంలో మ్యాజిక్ మెటీరియల్ అందని వారికి గురువారం అందజేశారు. మ్యాజిక్‌తో పాటు అనేక నీతికథలు పిల్లలకు బోధించారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్, విశ్రాంత ఎంపిడిఒ ఆదినారాయణ, మరో మేజీషియన్ గాజుల పిచ్చయ్య, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.





సమీక్షలో కలెక్టర్, సాధికారత కమిటీ సభ్యులు

సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను భారత ప్రభుత్వ సామాజిక, సాధికారిత కమిటి సభ్యులు తురకా నరసింహం ఆదేశించారు. పల్నాడు కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో గురువారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, ఎస్సీ, ఎస్టీ, సామాజిక తరగతుల కోసం వెంచర్ క్యాపిటల్ ఫండ్, క్రెడిట్ గ్యారంటి స్కీమ్, ఎంఎస్ఎంఇ పథకాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా వంటి పథకాలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కేంద్రం అమలు చేస్తోందని చెప్పారు. నూజెండ్ల మండలంలో మహిళా గ్రూపులను కలుపుకొని డెయిరీ డెవలప్‌మెంట్ పైలెట్ ప్రాజెక్ట్ కింద పెద్ద ఎత్తున పశువుల ద్వారా పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా పేద మహిళా గ్రూపులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో న్యూడిల్లీకి చెందిన డాక్టర్.లక్ష్మయ్య పాల్గొన్నారు.

14న కాలంతోపాటు కవితా సంపుటి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : ప్రముఖ సాహితీ వేత్త ఎస్ఎం సుభాని రచించిన కవితా సంపుటి 'కాలంతో పాటు' పుస్తకావిష్కరణ సభ ఈనెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేటలోని 2/7లోని కొరటాల సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా రచయితల సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహిస్తారని, పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవానిదేవి ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, రమ్య భారతి సంపాదకులు చలపాక ప్రకాష్ పాల్గొంటారని, పుస్తక సమీక్ష సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి చేస్తారని తెలిపారు. రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.